
# లౌకికవాదం వర్ధిల్లాలి



ఘనత వహించిన రాజకీయవేత్తగారిని అంతకుముందు రెండుసార్లు కలిసివున్నా, ఈసారి మాత్రం ఆయన చాలా బిజీగా ఉన్నట్టు మొహం పెట్టి నేనెవరో అపరిచితుడన్నట్టు ఎగాదిగా చూశారు. నేను నమస్కరించిన తర్వాతనే ఓ చిరునవ్వూ, దాంతోపాటు ఓ షేక్‌హేండూ పారేశారు.

"ఏదో ఆలోచిస్తున్నట్టున్నారు" అన్నాను ఏదో ఒకటి అనాలని.

"భలే కనిపెట్టాశారే! నేను నిజంగా దీర్ఘాలోచనలో మునిగివున్నాను. దేశపరిస్థితి ఇంత అస్తవ్యస్తంగా ఉంటే ఎవడు మాత్రం ఊరికే ఉండగలడు చెప్పండి?" ఆయన నుదుటిమీది ముడతలు ఆయన చెప్పినదానికి సాక్ష్యం పలికాయి.

ఆయనను చింతలపాలు చేస్తున్న దొంగను కనిపెట్టిన తృప్తిని మందహాసంతో తెలియబరుస్తూ "నానాటికీ పెరిగిపోతున్న ఆర్థిక వ్యత్యాసాల గురించేకదా మీ ఆందోళన?" అని అడిగాను. నికార్సైన సోషలిస్టు అయిన కారణంగా ఆర్థిక అసమానతలుండకూడదని నేను గాఢంగా విశ్వసిస్తాను. నేను ఇంకా కలర్ టీవీ కూడా కొనకుండానే మా ఇంటిపక్కాయన వి.సి.ఆర్.కొనేయడంతో ఈ అసమానతలు దినదినానికి పెరిగిపోతున్న విషయం సులభంగా కనుక్కోగలిగాను.

ఘరావేత్తగారు మెచ్చుకోలుగా నా భుజం తట్టేరు. "కీలకం పట్టేశారు. గొప్పా, బీదా తేడాలు ఎక్కువైపోతున్నాయి. మనం ఏదో ఒకటి, అదీ వెంటనే చేసితీరాలి. కానీ దీని కంటే మించిన సమస్య

ఎమ్బీయస్ ప్రసాద్

మరొకటి ఉంది, గమనించారూ?"

"ఓ, అదా? ఇప్పుడు తెలిసింది! మీ మనస్సు బాధపడుతూండడానికి కారణం దేశంలో స్వైరవిహారం చేస్తున్న మతవాదం. అవునా? అలా చెప్పండి. ఈ ఛాందసవాదులు, ముఖ్యంగా హిందూ ఛాందసవాదులు, రామజన్మభూమి గురించో, కాశ్మీరు పండిట్ల గురించో చేసే హడావుడి చూస్తే ఎవరికైనా మండుకొస్తుంది."

సామ్యవాదినీ, ప్రగతివాదినీ కావడంచేత నాకు మతఛాందసం అంటే పడదు.., ముఖ్యంగా హిందూ మతఛాందసం. నా దృష్టిలో అది సమాజానికి పట్టిన చీడ.

ఘరావేత్తగారు నా భుజాలు రెండు చేతులా పట్టుకొని కళ్ళు విప్పార్చి, నాకేసి చాలాసేపు చూస్తూనే ఉండిపోయారు. "అద్భుతం! దేశ సమస్యల గురించి మీకున్న నిశితదృష్టి అమోఘం. మతవాదానికి వ్యతిరేకంగా నేను సాగించే పోరాటంలో ఒక మిత్రుడు దొరికినందుకు నేను ధన్యుణ్ణి" అన్నారు ఆనందం ప్రకటిస్తూ.

నేనూ పొంగిపోయాను. "అటువంటి పోరాటంలో పాలు పంచుకోవడం నా అదృష్టంగా భావిస్తాను సార్. నిజానికి నా దగ్గిర దాని గురించి బ్రహ్మాండమైన పథకం ఒకటి రెడీగా ఉంది." ఎవరో వెనకనుంచి నా చొక్కా కొసలు లాగి నా వాక్ప్రవాహానికి అడ్డుకట్ట వేయబోయారు. తిరిగి చూస్తే మా అవిడ.

"వెళ్ళి పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకునీ చూసి పలకరిద్దామా?" అంటోంది.

కాస్సేపు ఆగమని ఆవిడకి చెప్పి ఘరావేత్తగారికి నేను పకడ్బందీగా రూపొందించిన వ్యూహం గురించి వివరించబోయాను. కానీ ఆయనే నన్నాపేడు. "మనం ఎప్పుడైనా కలిసి తీరిగ్గా మాట్లాడుకొందాం. ఓ పని చేస్తా. మిమ్మల్ని ప్రత్యేకంగా మతవాదంపై చర్చకు ఆహ్వానిస్తాను. అప్పుడు అన్ని విషయాలూ విశదీకరిద్దురుగాని. ప్రసుత్తం నేను ఎలక్షన్ ప్రచారం ఆరంభించడానికి రాష్ట్రమంతా పర్యటించవలసి వుంది. నేను ఎంచుకొన్న ఏకైక అంశమేమిటో తెలుసా? లౌకికవాదం. మిస్టర్ గోడ్‌బోలే, మీలాంటి వారి సహకారం లేనిదే..."

"క్షమించాలి, నా పేరు గాడ్గీళ్" సరిచేశాను..

"భలేవారు. మీ పేరు తెలియకపోవడమేమిటి? ఏదో నాలిక మెలతబడింది, ఎందుకైనా మంచిది మీ విజిటింగ్ కార్డు ఇవ్వండి. అవసరం పడ్డప్పుడు, మీ సహకారం కోసం పిలుస్తాం. ఈ లోపున మీ పరిధిలో మీరు లౌకికవాదం గురించి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తూండండి. మీ ఆఫీసులో, ఇంటిపక్కల, మీ ఫ్రెండ్స్ సర్కిల్లో ఎక్కడైనా సరే మీ ప్రచారాన్ని ఆపకండి".

ఈ ప్రబోధంతో నన్ను ఉత్తేజపరిచాక మిగతావారి సంగతి చూడడానికి వేత్తగారు సాగిపోయారు.

"ఏమిటి ఆయనతో ముచ్చట్లు, రాజకీయాలేనా?" అంది మా ఆవిడ సంశయంగా.

"ఇంకేమిటనుకొన్నావ్? చూస్తూండు రేపట్నుంచి మొదలుపెట్టి మతవాద భూతాన్ని భూస్థాపితం చేసేదాకా పోరాటం సాగిస్తాను" అన్నాను ఉత్సాహంగా, నొక్కి వక్కాణించకపోతే ఇటువంటి శల్యసారథ్యం చేసేవాళ్ళ తిక్క కుదరదు.

"అది చెయ్యడానికి మీరే దొరికారా? పోనీ మరీ అంత ముచ్చటగా ఉంటే గడప దాటకుండా మీ రాజకీయాలు కానివ్వండి. నా వంతు త్యాగం నేను చేస్తాను. మీరు పాలిటిక్స్, సోషలిజం, సెక్యులరిజం ఏది మాట్లాడినా సరే కిమ్మనకుండా వింటా. పనుందన్చెప్పి వంటింట్లోకి జారుకోను. ఎదురుప్రశ్నలు వేయను. సరేనా? మీరు మాత్రం..." అంది మా ఆవిడ దిగొచ్చి.

"చూడు మహాతల్లీ! ఇది నీకూ, నాకూ మాత్రమే సంబంధించిన సమస్య కాదు. సిద్ధాంతాలకు సంబంధించినది. ఒక సిద్ధాంతానికి బద్ధుడనయిన తర్వాత ఎవరు నొచ్చినా, ఎవరు మెచ్చినా మడమ తిప్పేది లేదు"

తెచ్చి పెట్టుకున్న అణకువ ఇగిరిపోయి, "మీ సిద్ధాంతాలూ చట్టుబండలూనూ" అంటూ బుసకొట్టి విసవిసా వెళ్ళిపోయిందావిడ.

మర్నాడు పొద్దున్న నా పాలబడ్డవాడు మా కొలీగ్ హసన్‌భాయ్. "హసన్‌భాయ్, హసన్‌భాయ్, దేశంలో పెచ్చరిల్లుతున్న మతవాదం గురించి నీకు చింతలేదా?" అనడిగేను.

"సవాలక్ష గొడవలతో నేను సతమతమవుతూంటే అది చాలనట్టు ఇదొకటా?" అన్నాడు హసన్‌భాయ్.

"మరి దేశం గురించి పట్టించుకొనేదెవడు చెప్పు" అన్నాను అనునయంగా.

"నేను మాత్రం కాదు. కావలిస్తే నువ్వు మహరాజులాగా పట్టించుకో, నా కభ్యంతరంలేదు"

"కానీ నీ సహకారం లేనిదే అది సాగదు"

"సహకారమా? అంటే?" అనుమానం తొంగిచూసింది అతని ముఖంనుండి.

"మరేమీ లేదు. మనం ముస్లిం సోదరులకు లౌకికవాదం గురించి వివరించి చెప్పాలి. దానికోసం పేటవరకూ మీటింగులు పెడదాం. మొదట మీ బస్తీలో ఓ సమావేశం పెట్టి నువ్వూ, నేనూ ఉపన్యాసాలిద్దాం. షాబానో కేసు గురించి, ముస్లిమ్ పర్సనల్ లా గురించీ.."

"నీకేం మతిపోలేదుకదా? అటువంటివి మాట్లాడితే పళ్ళు రాలతాయి. పళ్ళు రాలగొట్టించుకోవడం కథారంభం మాత్రమే. ఆ తర్వాత కథ కంచికీ, మన మింటికీ ఎలా వెళ్తామో నాకు తెలీదు" భవిష్యత్తు గురించి ఆలోచన ఒళ్ళు జలదరింపజేసిందేమో, టోపీ జారిపోబోయింది. దాన్ని సరిచేసుకుంటూ అదే పరుగు.

ముస్లిమ్ జనాలతో నాకు పెద్దగా పరిచయం లేకపోవడంవలన హిందువుల పైనే నా దృష్టిని కేంద్రీకరించాను. అదొక్కటే కారణం కాదు. జనాభాలో ఎక్కువశాతం వారే కాబట్టి మతవాదుల్లో కూడా వారే ఎక్కువ ఉండాలని తర్కం చెబుతుంది. పైగా ఏ అభ్యుదయవాది వ్యాసాలు, ఉపన్యాసాలు చదివినా, వినినా ముస్లిములు, క్రిష్టియన్లు, పార్శీలు ఇత్యాది అల్పసంఖ్యాక వర్గాలంతటి సహనశీలురు, శాంతస్వభావులు ఎవరూ లేరని తెలుస్తుంది.

అందువల్ల హిందువులమీదే పడాలి. ఇరుగూ, పొరుగూ హిందువులకామాటే చెబితే వారికి రుచించలేదు. మతవాదులనిపించుకోవడం ఇష్టం లేనట్టుంది. సల్మాన్ రుష్దీ గొడవ గురించి, ఫామిలీ ప్లానింగ్‌పై పోప్ అభిప్రాయాల గురించీ, కాశ్మీర్‌నుంచి పండిట్‌లను తరిమివేయడం గురించి అదీ ఇదీ మాట్లాడారు.

లౌకికవాదంలో నాకున్న అచంచల విశ్వాసంవలన వాటన్నింటినీ తిప్పికొడుతూ వాదించేవాణ్ణి. వీధిలో నిలేసి కూడా నచ్చచెప్పబోయేవాణ్ణి కానీ వాళ్ళు పాపం బిజీగా ఉండడంవల్ల ఎక్కువసేపు నా వాదనలు వినలేకపోయేవారు. ఇంటి దగ్గరైతే విశదంగా మాట్లాడుకొవచ్చుకదాని వాళ్ళ ఇంటికి వెళ్ళేవాణ్ని. కానీ అదేం చిత్రమో, నే వెళ్ళగానే వాళ్ళ భార్యలు నాకెదురొచ్చి భర్తలు ఇంట్లో లేరని చెప్పేవారు. ఒక్కొక్కప్పుడు భర్తలు నా కంటబడినా, ముందు అవీ ఇవీ మాట్లాడి లౌకికవాదం చర్చ రసపట్టులోకి వచ్చే సమయానికి బజార్లో పనుందంటూ జారుకొనేవారు.

అంతగా చదువుకోని ప్లంబర్, ఎలక్ట్రీషియన్ వంటివారిని వివేకవంతులుగా చేసే బాధ్యత కూడా మనదేకదాని వాళ్ళకీ లౌకికవాదం గురించి చెప్పబోతే వాళ్ళు అదోలా చూసి వెళ్ళిపోయారు.

తరువాత కాకతాళీయమో, ఎగతాళీయమో గానీ మా ఇంట్లో కరెంటుపోయింది. ఎన్ని కబుర్లు పంపినా రెండురోజులైనా ఎలక్ట్రీషియన్ జాడలేదు. నేను చికాకు పడుతూంటే మా ఆవిడ వెటకారం మిళాయించి " ఇలా ఎందుకు జరిగిందో మీకు తెలియదనే అంటారా?" అనడిగింది.

"ఏమో, వైరింగులో ఏదైనా లోపం ఉందేమో" అన్నాను.

"లోపం వైరింగులో కాదు, మరోచోటుంది" అంది అర్థవంతమైన చూపుల బరపుతూ.

నాకేం బోధపడలేదు. "ఎక్కడ?" అన్నా.

"అబ్బబ్బ? అఘోరించినట్టే ఉంది మీ తెలివి. మిమ్మల్ని చూస్తేనే జనం పారిపోతున్నారని తెలియటంలేదూ?"

"నిజంగానా?"

“కాకపోతే? మీ ఉపన్యాసాలు ఆపకపోతే ఇంతకంటే అఘాయిత్యాలు జరుగుతాయి. అసలే ఎలక్ట్రీషియన్ ఇటువంటి విషయాల్లో గట్టి అభిప్రాయాలున్నవాడని వినికిడి. అతని దగ్గిర మీ ధోరణిలో మీరు మాట్లాడితే కొంప మునుగుతుంది” పెడసరంగా మాట్లాడటంలో ఆవిడని మించిన వాళులేరు.

“మైగాడ్! కరంటు అందుకే పోయిందంటావా? మనుషులు ఇంత సంకుచితంగా ప్రవర్తిస్తారంటావా?” అనుమానం తీరక అడిగాను.

“దివ్యంగా. గట్టిగా మాట్లాడితే సంకుచితంన్నరగా ప్రవర్తించగలరు. రేప్పొద్దున్న మీ స్కూటర్ టైర్లలో గాలి తీసేసినా, నాకేం వింతగా తోచదు. అందుకని ఇప్పటికైనా మీ పోరాటానికి స్వస్తి పలకండి” మా ఆవిడ కుండబద్దలు కొట్టి నిజం చెప్పే ప్రయత్నంలో స్టీలు బిందెను వంటింటి గడపమీద బాదింది.

“కానీ నా సిద్ధాంతాలు నాకున్నాయి” నేనూ ఉద్ఘాటించాను.

“సంతోషం. వాటన్నిటినీ భోషాణంలో పెట్టి తాళం వేయండి లేదా వాటిని చాటుకోవాలని మరీ అంత ఇదిగా ఉంటే ఏ కోయంబత్తూరో, గౌహతియో వెళ్ళి అక్కడి జనాలకి ఉద్బోధించి వాళ్ళు కర్రలు తిరగేసేలోగా చప్పున తిరిగొచ్చెయ్యండి. అంతేగానీ మన పేటలో మాత్రం ప్రయోగాలు కట్టిపెట్టండి”

నేను సిద్ధాంతాలకు నిబద్ధుడనయినవాడినే గానీ, గాలి తీసేసిన స్కూటర్ని అరమైలు దూరంలో ఉన్న పెట్రోలు బంకుకు తోసుకెళ్తున్న దృశ్యం కళ్ళముందు కదలాడుతూండడంతో ఉత్సాహం కాస్త చప్పబడింది. అందువల్ల సెక్యులరిజం విషయం పక్కనబెట్టి జనాలతో క్రికెట్టు గురించీ, వర్షాల గురించీ, పెరిగేధరల గురించీ మాట్లాడడం పునఃప్రారంభించాను.

కొన్నిరోజుల తర్వాత ఘరావేత్తగారు మళ్ళీ కలిశారు. నన్ను చూడగానే మొఖమంతా నవ్వు చేసుకొని “ఈసారి పొరబాటు చేయనండోయ్. మీ పేరు గాడ్గీళ్. మీకు సోషలిజం, సెక్యులరిజం అంటే మహా అభిమానం. కరక్ట్? ఆఁ ఇప్పుడు చెప్పండి- మీ ఉద్యమం ఎలా నడుస్తోంది?”

కాస్త విషాదంగానే, “ఏం చెప్పమంటారు? సరిగ్గా నడవటంలేదు. కుంటడం కూడా లేదు. నన్నడిగితే జనాలకి మతవాదం తప్ప లౌకికవాదం తలకెక్కదంటాను. మీ అనుభవమూ ఇంతేకదా?”

“నో, నో. నా ఎలక్షన్ టూర్లో లౌకికవాదంవైపు ప్రజలు మొగ్గుతున్నారని స్వయంగా గమనించాను. నిజానికి వారెంతో ఉత్సాహం చూపుతున్నారు కూడా’ అన్నారు వేత్త నవ్వుతూ.

నాకు కుతూహలం పెరిగింది. “మీరు కాస్త వివరంగా చెప్పాలి” అని కోరాను.

“చెప్తా వినండి! నా ఎన్నికల ప్రచారం ప్రతాప్‌గఢ్‌లో భవానీ మందిరం వద్ద పూజతో ఆరంభించానండి. మాత కుంకుమ చేతబట్టి ప్రజల్ని సూటిగా అడిగాను. “భవానీమాత శివాజీ మహరాజ్‌కి స్వయంగా నేర్పిన లౌకికవాదం సమర్థిస్తారా లేక బ్రాహ్మణుల తిరోగమన మతవాదాన్ని సమర్థిస్తారా” అని. ‘జై భవాని’ అని ప్రజలరిచిన కేకలతో దిక్కులు పిక్కటిల్లాయంటే నమ్మండి. అప్పటికప్పుడు లౌకికవాదాన్ని సమర్థిస్తూ పెద్ద ఊరేగింపు కూడా బయలుదేరతీశాను. తెలుసా?”

“భేష్, భేష్” అన్నాను నేను.

“అది ఆరంభం మాత్రమే నండోయ్. ఆ తర్వాతి ఊళ్ళో వెనకబడ్డ జాతులవారి ఊరేగింపును ఉద్దేశించి ప్రసంగించా. ఏమనో తెలుసా? మీరు వెనకబడి ఉన్నారంటే కారణం ఎవరు? మీ అవకాశాలు అణగదొక్కిన అగ్రజాతులవారు కారూ? ఇటువంటి మతవాదం కొనసాగాలా? మీ జనాభా నిష్పత్తి కనుగుణంగా ఉద్యోగాల రిజర్వేషన్లు కావాలా? మీ కులాలకు చెందిన మంత్రులు ఒకరు... ఒకరే ఎందుకు? ముగ్గురు... కాబినేట్ ర్యాంకు మంత్రులు.. మంత్రివర్గంలో ఉండి లౌకికవాదాన్ని నిలబెట్టాలా? అక్కర్లేదా” అని అడిగాను. వాళ్ళు ఆకాశం దద్దరిల్లేలా సింహధ్వానాలు చేసి లౌకికవాదానికి సమ్మతి ప్రకటిస్తూ అప్పటికప్పుడు పెద్ద ఊరేగింపు ఏర్పాటు చేశారు”

“భలే, భలే”

“అంతటితో ఆగలేదండోయ్! తర్వాత ఊళ్ళో ముస్లిముల సభనొకటి ఏర్పాటుచేసి నా ప్రసంగంలో

లౌకికవాదం ప్రకారం మీరు కొరాన్ బోధనలననుసరించి మీ మతాన్ని ఆచరించాలి. అటువంటి లౌకికవాదం కావాలో లేక మీ పర్సనల్ లా లో జోక్యం చేసుకొనే కరడుకట్టిన మతఛాందసం కావాలా? అని అడిగేసేను. వాళ్ళందరూ 'అల్లా హో అక్బర్' అని ఒక్కుమ్మడిగా అరిచి లౌకికవాదానికి వత్తాసు పలికారు.

నాకు ఆనందంతో కన్నీరు ఉబికింది. "మీరు నిజానికి దేశాన్ని మతవాదుల బారి నుండి రక్షించారు. లౌకికవాదం మనదేశంలో మనగలదంటే అది మీలాంటివారి చలవే" అనేశాను.

"ఏదో మీలాంటివారి ఆశీస్సులవల్ల అలాటివెన్నో చేస్తున్నాననుకోండి. మీవంతు సహాయంగా మీరు కూడా ఈ నా కృషి గురించి పత్రికలవాళ్ళకి ఒక స్టేటుమెంటు మిగతా వారిచేత కూడా సంతకాలు పెట్టించి ముప్ఫైమంది మేధావుల ప్రకటన అని ఇస్తే బాగుంటుందనుకొంటాను"

" తప్పకుండా! దానికేం భాగ్యం! ప్రకటనలు ఇవ్వడానికి మా మేధావులు ఎప్పుడూ ముందుంటారు" అంటూ ఉప్పొంగిపోతూ హామీ ఇచ్చాను.

(గంగాధర్ గాడ్గీళ్ మరాఠీ రచనకు అనువాదం
విపుల ఏప్రిల్ 1997)

# ఆలూమగలీయం

## ఆరు గ్రహాల అరిష్టం

మే 3, 2000న ఆరుగ్రహాలు ఒకే రాశిలో కలవడం
అరిష్టదాయకమని పండితుల జోస్యం - వార్త

"చూసావా, ఆరుగ్రహాల కూటమి అని నానా హడావుడి చేసావ్? ఏం కాలేదు. చూడు."

"ఏం కాకపోవడమేమిటి? పొద్దున్నించీ ఎండ పేల్చేస్తూంటేను..."

"జోకులాపవోయ్, సతీసావిత్రీ! నిన్నటిదాకా నువ్వేమన్నావ్? ప్రళయం వచ్చేస్తుంది, లోకం అల్లకల్లోలమయిపోతుంది అన్నావు. ఇవాళ పొద్దున్న ప్లేటు ఫిరాయిస్తున్నావ్..."

"బాగుంది. అందరూ అన్నారు కాబట్టి నేనూ అన్నాను. నేనేమైనా వెళ్లి గ్రహాల నడిగి వచ్చానా?"

"ఈ లాజిక్కు ఇంతకు ముందు ఉపయోగించలేదేం? గ్రహాలు ఇవి చేస్తాయిట, అవి చేస్తాయిట అని తెలిసీ తెలియకుండా కబుర్లెందుకు చెప్పడం?"

"అవేం చేయవని మీకు మాత్రం ఖచ్చితంగా చెప్పాయా? ఎవరి గెస్ వాళ్లది."

"నాకెవ్వరూ ఏం చెప్పక్కరలేదు. నాకు ముందే తెలుసు. ఇదంతా ట్రాష్ అని..."

"...అలా కొట్టిపారేయకండి. పంచాంగం రాసేవాళ్లు ఫలానా రోజు అమావాస్య అంటే చంద్రుడు కనబడటం లేదు. ఫలానా రోజు గ్రహణం అంటే, ఆ రోజు గ్రహణం వచ్చి తీరుతోంది. ఏమీ తెలీకుండా ఇవన్నీ కరక్టుగా చెప్పేస్తున్నారా?"

"సావిత్రీ, లిజన్ టు మీ. ఈ అమావాస్యలు, గ్రహణాలు - ఇవన్నీ ఎస్ట్రానమీ, ఖగోళ శాస్త్రం. దానికీ ఎస్ట్రాలజీ అంటే జ్యోతిష్యానికి లింకు పెట్టకు."

"దానికాధారం ఇదే కదా! గ్రహాలు తిరగడం గురించి వీళ్లకు తెలుసు కానీ వాటి ప్రభావం మనమీద ఎలా పడుతుందో చెప్పలేరు అంటారు. అంతేనా?"

"అంతేగా మరి! నీకీ పాయింటు వందసార్లు చెప్పాను. అయినా మూర్ఖంగా వాదిస్తావు. కొంతమంది ఐదు గ్రహాల ప్రభావాన్ని లెక్కేస్తారుట. కొంతమంది ఏడు. మరికొందరు తొమ్మిది. ఇంకొంతమందేమో.."

"..పదకొండు. ఇదీ చెప్పేరులెండి. ఏమయితేనేం, వాళ్లు చెప్పినవి కొన్ని జరుగుతున్నాయా, లేదా? అది చెప్పండి ముందు."

"గాడిదగుడ్డు జరుగుతున్నాయి. ప్రపంచం పుట్టి మునిగిపోతుందన్నారు. ఏదీ? నిక్షేపంలా ఉంది. పొద్దున్నే పాలవాడొచ్చాడు, పేపరు వచ్చింది..."

"...అప్పుడే మురిసిపోకండి. ఇంకా గట్టిగా తెల్లారలేదు. ఇకపైన ఎన్ని ప్రమాదాలొస్తాయో, ఎన్ని

కరువులొస్తాయో, కాటకాలొస్తాయో..."

"..చాలా బాగుంది. ఇప్పటినుండి పదేళ్ల దాకా వచ్చే అరిష్టాలన్నీ ఈ ఎక్కవుంట్లో వేస్తావేమిటి? ఇదివరకు అష్టగ్రహ కూటమి గురించి కూడా ఇలాగే చెప్పారట..."

"..ఏదీ, 1962 ఫిబ్రవరిలో వచ్చిందన్నారు. అదా? అప్పుడూ ఏవో ఉత్పాతాలు జరిగేయని విన్నానే!"

"ఏమీ కాలేదట! మా అన్నయ్య చెప్పాడు. భూకంపాలు లేవు, ప్రళయాలు లేవు. నీ లాగే వాడూ నమ్మి ఉప్పెనలో వాడి స్కూలు కొట్టుకుపోతుందని ఆశపెట్టుకుని నెల్లాళ్ల ముందునుండీ స్కూలు ఎగ్గొట్టేసాడట!"

"...కొట్టుకుపోయిందా?"

"ఉప్పెనే రాలేదు. ఇంకేం కొట్టుకుపోతుంది? వాళ్ల మేష్టారు మాత్రం వీణ్ని తుక్కుతుక్కుగా కొట్టి ఆ ఏడు ఫెయిలు చేసి పారేసేట్ట."

"ఇంకేం మరి? అరిష్టమేమీ జరగలేదంటారు? పరీక్ష పోవడం అరిష్టం కాదేమిటి?"

"చాల్లే! పరీక్ష పోవడం పెద్ద ఉపద్రవమా?"

"మీ ఇంట్లో అలాగే ఉంటుంది కాబోలు. మా ఇంట్లో మాత్రం పరీక్ష పోవడం చాలా అప్రదిష్టగా భావిస్తాం. మా వాళ్లెవరిదీ పరీక్ష పోలేదు తెలుసా? నేను కూడా చిన్నప్పణ్నుంచీ.."

"ఇక ఆపు నీ చదువు పురాణం. పురాణమంటే గుర్తొచ్చింది, నువ్విక ఈ గుళ్లో పురాణాల శాస్త్రుల మాటలు విని అనవసరంగా భయపడటం మానేయ్."

"ఆయనే కాదండీ, చదువుకున్నవాళ్లు కూడా ఇదే మాటన్నారు..."

"అదే చెప్పవస్తున్నా, పురాణాల శాస్త్రుల్లే కాదు, పాంటు వేసుకున్న ప్రాఫెట్స్ ఆఫ్ డూమ్స్‌డేలను కూడా పక్కన పడేయ్. వాళ్లు ఊరికే హడలగొట్టి పేరు సంపాదించుకుంటారు. లేదా శాంతులని దోచేస్తారు."

"వాళ్లు నమ్మినది వాళ్లు చెబుతున్నారు. నమ్మడం, నమ్మకపోవడం మీ ఇష్టం... మీ ఖర్మం"

"అదే వద్దంటున్నాను. ఈ ఆరుగ్రహాల కూటమి తెచ్చే అరిష్టం అంతా బూటకం అని తెలిపోయింది కదా..."

"...అంటే ఈ శతాబ్దంతోనే ఈ యుగం ఆఖరయిపోతుందని చెప్పినది కూడా..."

"..అదీ అబద్ధమే! చూడు 2000 సంవత్సరానికి క్షేమంగా వచ్చేసాం కదా!"

"మరి ఈ రైలు ప్రమాదాలు, రోడ్డు ఏక్సిడెంట్లు.."

"ఇవన్నీ ప్రతీ ఏడాది ఎన్ని ఉంటాయో, ఈ ఏడాది అంతే ఉన్నాయి. కావాలంటే స్టాటిస్టిక్స్ తీసి చూడు..."

"...హమ్మయ్య, మీరు చెబుతూంటే ఇప్పుడు ధైర్యం వచ్చిందండీ. నిన్న సాయంత్రం దాకా హడిలిచచ్చాను. ఆ భయంతోనే..."

"...ఆగాగు, ఎవరో తలుపు తడుతున్నట్టున్నారు. వెళ్లి చూసి రా"

"చూసొచ్చా. లక్ష్మీ సిల్క్ ప్యాలెస్ అబ్బాయి"

"అతనెందుకు వచ్చాడు?"

"అదే చెప్పవస్తున్నా. ఈ ఆరుగ్రహాల హడావుడితో భయపడిపోయాననుకోండి. ఇవాళ తెల్లారుతుందని, నేను బతికి, బట్టకట్టి లోకాన్ని చూస్తానని అనుకోలేదు. జీవితంలో ఆఖరిరోజు కదా, చాన్నాళ్లుగా అనుకుంటున్న కోరిక తీర్చుకుంటే మంచిది కదా అని.."

"...కదా అని, ఏమిటో త్వరగా చెప్పు తల్లీ. నా మనస్సు ఏదో కీడు శంకిస్తోంది."

"మరేం లేదు. మీకు ఎప్పణ్నుంచో చెప్పలేదూ... ముక్కుపొడుం రంగు మైసూరు శిల్కు చీర నా



కిష్టం అని.. అది మూడు వేలకు కొనుక్కొచ్చి నిన్న సాయంత్రం కట్టేసుకున్నాను, ఎటుపోయి ఎటొచ్చినా ఫరవాలేదు కదాని."

"కొనడానికి డబ్బెక్కడిది?"

"వినండి. అన్నిటికీ ఖంగారే మీకు! నేను గొప్ప ఐడియా వేసాను. ఇంట్లో డబ్బుంది, రేపు పొద్దున్న వస్తే ఇచ్చేస్తా అని చెప్పా. ప్రళయం వచ్చి అందరం పోయేమనుకోండి, అప్పుడు డబ్బు ఇవ్వనే అక్కర్లేదు..."

"...బతికుంటే డబ్బిచ్చుకోవాలన్న ఆలోచన రాలేదా?"

"బతికుంటానన్న నమ్మకం కలగలేదండి. ఇప్పుడు మీరు చెప్పేరు కాబట్టి ఈ గ్రహ కూటముల వల్ల అరిష్టాలేమీ కలగవని బాగా తెలిసొచ్చింది. ఇకపై..."

"...అరిష్టాలు కలగవనడం తప్పు. మూడువేలు అప్పుపడడం అరిష్టం కాక ఇంకేమిటి? గ్రహ ప్రభావం మనుష్యుల మీద తప్పకుండా ఉందని నాక్కూడా తెలిసివచ్చింది. నువ్వూ తెలుసుకో!"